

## పీడీ యాక్ట్ కేసును ఉపసంహరించాలి

**పిఠాపురం:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట బల్క్ (డ్రగ్) ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలతో పోరాటం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పీడీ యాక్ట్ కేసును ఉపసంహరించాలని సిపిఎం మండల కమిటీ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తున్న వ్యక్తిపై పీడీ యాక్ట్ పెట్టడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో రాజయ్యపేట గ్రామం హైవే రోడ్డుపై ప్రజలతో కలిసి బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ భూ సేకరణకు వ్యతిరేకంగా నేటి హోంమంత్రి అనిత ఆందోళన చేశారని గుర్తు చేశారు. అదే సమస్యపై పోరాడుతున్న నాయకుడిని అరెస్టు చేయడం దారుణమన్నారు. తక్షణమే ఆయనపై పీడీ యాక్టును రద్దు చేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రకటనను విడుదల చేసిన వారిలో సిపిఎం మండల కన్వీనర్ కుంచే చిన్న, నాయకులు నాగేశ్వరరావు, మణి, వీరబాబు, మణికంఠ ఉన్నారు.

# కోడి పందేలకు సై

- సంక్రాంతికి సిద్ధమౌతున్న బరులు
- పుంజులకు భారీగా పెరిగిన గిరాకీ
- ఊపందుకున్న అమ్మకాలు
- చేతులు మారనున్న రూ. కోట్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సంక్రాంతి అంటేనే అందరికీ గుర్తు వచ్చేది కోడి పందేలు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈసారి పందేలకు భారీగా డిమాండ్ ఉండేలా కనిపిస్తుంది. అందుకు తగ్గట్టుగానే పందెం రాయళ్లు సిద్ధపడుతున్నారు. పందేలకు పుంజులను రెడీ చేసుకుంటున్నారు. దీంతో ఆయా రకాల పుంజులకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే అనేకమంది ఏడాది కాలంగా పందేల కోసం పుంజులను పెంచుతున్నారు.

సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో కోడి పందేల నిర్వహణ కోసం అధికార పార్టీ చోటా నాయకులు సిద్ధపడుతున్నారు. మరో 20 రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఇప్పటి నుంచే బరుల ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టారు. సాంప్రదాయం పేరిట కొందరు, వినోదం పేరుతో మరికొందరు, దండిగా ఆదాయాన్ని సమకూర్చుకునే పనిలో ఇంకొందరు ఇలా పందేల నిర్వహణకు సిద్ధపడుతున్నారు. ఆనవాయితీ ముసుగులో కోడిపందాలతో పాటు పేకాట, గుండాట, ఇతర జూదాలకు తెరలేపేందుకు సన్నద్ధం అవుతున్నారు. అడ్డుకుంటామని పోలీసులు ఒకవైపు హెచ్చరిస్తున్నా అధికార పార్టీ నేతలు మాత్రం ఆడించి తీరుతామన్న సంకేతాలు ఇస్తున్నారు. ప్రధానంగా సంక్రాంతి కోడిపందాలు కూటమి నేతలకు భారీగా ఆదాయాన్ని సమకూరుస్తుండడం వలన వీటిని ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకోలేని పరిస్థితి కనిపిస్తోంది.

**వేలల్లో పలుకుతున్న కోళ్లు**

కోడి పందాల్లో పాల్గొనే పుంజులకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఒక్కో పుంజు రూ.20 వేలు నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు కూడా పలుకుతాయి. ఇప్పటికే ప్రధానంగా జిల్లాలో కాకినాడ రూరల్, గొల్లప్రోలు, పిఠాపురం, కరప తదితర మండలాల్లో పుంజులను సిద్ధం చేస్తున్నారు. పుంజు రకం, డేకెట్టె విధానాన్ని బట్టి ధర పలుకుతుంది అని నిర్వాహకులు చెబుతున్నారు. పందేనికి ఒక పుంజును సిద్ధం చేయడానికి రూ. 20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుందని, ఏడాది పాటు దానిని మంచి బలమైన పౌష్టికాహారం పెట్టి పోషించాల్సి వస్తుందని పలువురు కోళ్ల పెంపకందారులు చెబుతున్నారు.తూర్పు గోదావరి, కోనసీమల్లో కొంత మంది రహదారుల పక్కనే కోడి పుంజులను విక్రయిస్తున్నారు.



తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నక్కిల్లమ్మ చెరువు సమీపంలో అమ్మకానికి పెట్టిన కోడి పుంజులు

**గోదావరి జిల్లాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా**

సంక్రాంతి వేడుకలు గోదావరి జిల్లాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంక్రాంతికి గోదావరి జిల్లాలు పెట్టింది పేరు. అందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సిటీ, రూరల్, కరప, పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, ఐ.పోలవరం, ముమ్మిడివరం, అల్లవరం, అమలాపురం, కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, అంబాజీపేట, అయినవిల్లి, కాట్రేనికోన, రామచంద్రపురం, రాజోలు, సీతానగరం, కోరుకొండ, పెదపూడి, కొవ్వూరు తదితర మండలాల్లో విచ్చలవిడిగా కోడి పందేలు జరుగుతాయి. చిన్న, పెద్ద కలిపి అన్నిచోట్ల దాదాపు 500 వరకూ బరులు ఏర్పాటు అవుతాయి. కోడిపందేలు జరిగే చోటే పేకాట, గుండాట శిబిరాలూ నిర్వహిస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలూ, భోజన వసతులూ ఏర్పాటు చేస్తారు. ఏటా సంక్రాంతికి ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి చుట్టాలు, స్నేహితుల పేరుతో జిల్లాకు వచ్చినవారు ముందస్తుగా లాడ్జిల్లో బసచేసి బరుల వద్దకు చేరతారు. మొత్తంగా సంక్రాంతి పేరు చెప్పి కోడిపందాల నిర్వహణ ద్వారా సుమారు రూ.600 కోట్లు పైనే సొమ్ము చేతులు మారతాయి. ఈ సారి సంక్రాంతికి సైతం ఇదే స్థాయిలో సొమ్ములు చేతులు మారే అవకాశం కనిపిస్తోంది.

**మొదలైన బేరసారాలు**

సంక్రాంతి పేరుతో మూడు నుంచి వారం రోజులు పాటు కోడిపందాలు ఆడుకోవడానికి ఇప్పటి నుండే ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకులు బేరసారాలు మొదలుపెట్టారు. ప్రతి సంవత్సరం నిర్వహించే బరుల్లో యథేచ్ఛగా పందేలు నిర్వహించుకునేందుకు సిద్ధపడుతున్నారు. కోడి పందేలు జరిగిన్నన్ని రోజులూ అటువైపు కన్నెత్తి చూడకుండా పోలీసులకు ముడుపులు అప్పజెప్పేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో హైవేను ఆనుకుని ఉన్న గండేపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ఏటా ఈ పందేలు ప్రతిష్టాత్మకంగా జరుగుతుంటాయి.

**పోలీసులు చేతులు కట్టుకోవాల్సిందేనా..?**

సాంప్రదాయం పేరుతో జూదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా యంత్రాంగం ఏటా చెబుతూ ఉంటోంది. కానీ ప్రజా ప్రతినిధుల ఒత్తిడితో పందెం రాయళ్లు పోలీసుల హెచ్చరికలను ఏమాత్రం లెక్కచేయకుండా బరులను సిద్ధం చేస్తుండడం ఏటా జరుగుతున్న తంతుగానే కనిపిస్తుంది. ఈసారి కూడా అదే కోడిపందాలు, గుండాట, పేకాట శిబిరాలు కొనసాగే అవకాశం కనిపిస్తోంది.



మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## మనుస్మృతి ప్రతుల దహనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటిన నేటికీ దేశంలో ఇంకా మనుస్మృతి రాజ్యమేలుతుందని ప్రజా సంఘాల నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఎంబియుయుఎస్న్యా, కెవిపిఎస్ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంబియుయుఎస్న్యా అధ్యక్షుడు కన్నీడి వెంకటరమణ, మహిళా నాయకురాలు కమిడి ఈశ్వరీబాయి, మాల మహానాడు నాయకులు జక్కల ప్రసాద్‌బాబు, కెవిపిఎస్ కన్వీనర్ విప్పర్తి శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. మానవ హక్కుల కోసం అంబేద్కర్ చేసిన ఒక చారిత్రాత్మక ధిక్కార సాహసోపేతమైన కార్యక్రమం మనుస్మృతి దహనం అన్నారు. మనుషులను జంతువుల కంటే హీనంగా చూసేలా మనువు రాసిన శాసనమే మనుస్మృతి అన్నారు. అందులో మహిళల పరిస్థితి మరింత దారుణమన్నారు. భర్త మరణిస్తే ఆ చితిపై భార్యను వేసి దహనం చేసే సతీసహగమనం వంటి దుర్మార్గమైన ఆచారాలు మనుస్మృతిలో ఉన్నాయని తెలిపారు. సమాజంలో అసమానతలకు, దురాచారాలకు చట్టబద్ధంగా ఉన్న మనుస్మృతి ప్రతులను1927 డిశంబర్ 25న అంబేద్కర్ దహనం చేసే ఇప్పటికీ ఆ పరిస్థితి కొనసాగిందన్నారు. నేడు దేశాన్ని పాలిస్తున్న మనువు వారసులు రాజ్యాంగాన్ని మార్చి తిరిగి మనువు శాసనాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుసుమ శ్రీనివాస్, రేవు నాగేశ్వరరావు, పినిపే నాగేంద్రరావు, దుప్పి అదృష్టదీపుడు, పులుపకూర గోపాలకృష్ణ, దున్నా మురళీకృష్ణ, గోడి భాస్కరరావు, కాశి శ్రీనివాస్, లంక రవి, తణుకు రాంబాబు, జక్కల అఖిల్, దున్నా అనిల్, నరాల వాడపల్లి పాల్గొన్నారు.

## బాలగంగాధర్ కుటుంబానికి ఎంఎల్ఎ జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

పితృవియోగంతో బాధపడుతున్న ఆదిత్య హాస్పిటల్ అధినేత ఎం.బాలగంగాధర్‌రావును గురువారం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. బాలగంగాధర్‌రావు తండ్రి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ స్వర్గీయ మేకా సుబ్బారావు తెలుగు పండిట్‌గా ఎందరికో విద్యా బుద్ధులు నేర్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, వల్లూరి సూరిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పీలా మహేష్, రవితేజ, వల్లూరి వెంకట గంగాధర్, దాపర్తి సీతారామయ్య, కొండ్రోతు శ్రీను, బాలు రెడ్డి పాల్గొన్నారు.



సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## ఎస్ఎఫ్ఐ కల్చర్ ఫెస్ట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక అంబేద్కర్ భవనంలో ఈనెల 27, 28వ తేదీలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే కల్చర్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు. గురువారం అంబేద్కర్ భవన్ వద్ద సంబంధిత పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లోవరాజు, గంగా సూరిబాబు మాట్లాడుతూ నేటి యువతలో సంస్కృత సాంప్రదాయాలు మర్చిపోయి, విదేశీ సాంప్రదాయాలకు దగ్గరవుతున్నారని అన్నారు. తద్వారా యువత పెడత్రోవను పడుతుందన్నారు. సోషల్ మీడియా ఇతర కార్యక్రమాలకు ఆసక్తి చూపిస్తున్న నేటి యువతకు మన సాంప్రదాయ సంస్కృతులను తెలియచేయాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ ఈ కల్చర్ ఫెస్ట్‌ను నిర్వహిస్తుందన్నారు. కల్చరల్ పెస్ట్‌లో విద్యా ర్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిటీ కార్యదర్శి పి.సత్యం, జిల్లా నాయకులు సంతోష్‌కుమార్, విపిన్‌కుమార్, జయరాం, తేజు, నగర నాయకులు మణికంఠ, నాగరాజు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**జిల్లాలోని క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు దుస్తులు, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పలు చోట్ల చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.**

ప్రజాశక్తి - యంత్రాంగం

**జగ్గంపేట** మండలంలోని పలు చర్చిలలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు విద్యా సంస్థల్లో క్రిస్మస్‌ను పురస్కరించుకుని వివిధ వేషధారణలతో విద్యార్థులు అలరించారు. స్వామి వివేకానంద విద్యా సంస్థల ఆవరణంలో కరస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. అలాగే అమృత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో స్కూల్ అధినేతలు లోవరాజు, శ్రీనివాస్, సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పాస్టర్ బ్రహమ్, లిల్లీ, విద్యార్థులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పలు ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్‌లోని పునరుద్దాన బాప్టిస్ట్ సంఘంలో జడ్‌పిటిసి, మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, క్రీమ్ సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెంకెవారిపేటలోని న్యూ లైఫ్ బేతేస్తా ప్రార్థన మందిరంలో పాస్టర్ అభిషేక్ రూబెన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వస్త్ర దానం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఉంగరాల వెంకటేశ్వరరావు, డి.యాకోబు, రూతమ్మ, మల్లాడి శాంతిరాజు, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మండలంలోని ఇంద్రపాలెం మౌంట్ కార్మెల్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నానిశెట్టి వీరాంజనేయ సాయిరాం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ వీరాంజనేయ సాయిరాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తూరంగిలో ఉన్న 18 చర్చిలకు చెందిన పాస్టర్లకు ఎంఎల్ఎ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు పితాని తేజ, వల్లూరి రాజా, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ గరగా రామలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** ఆదిత్య యూనివర్సిటీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, హాస్టల్ ఇంచార్జ్ జి.హరీష్‌రెడ్డి, చర్చి పాస్టర్ పీటర్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సూరంపాలెం గ్రామానికి చెందిన గుత్తుల గంగాధర్, విజయభారతి దంపతుల ఆధ్వర్యంలో ఇంటింటికీ క్రిస్మస్, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేస్తూ స్వీట్ బాక్స్, క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోసిన బాబురావు, ప్రగడ రెడ్డి వీరబాబు, గల్లా కష్ణ మాధవ్, అల్లం మూర్తి, అబ్బులు, పసుపులేటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **పిఠాపురం** పట్టణ, మండలంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా బాప్టిస్ట్ చర్చ్‌లో జరిగిన కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎంఎల్ఎలు ఎస్‌విఎస్ఎన్.వర్మ, పెండెం దొరబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి, కిషోర్ పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. **కాకినాడ** స్థానిక జగన్నాథపురంలోని చర్చి స్క్వేర్ సెంటర్‌లోని సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ సంఘంలో నిర్వహించిన వేడుకలో ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పాల్గొన్నారు. క్రైస్తవులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వి.సుధారాణి, కోశాధికారి డివి.రమణ, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, సలహాదారులు ఎ.శామ్యూల్, కె.సుభద్ర, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణ, మండల పరిధిలో పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సెంటినరీ బాప్టిస్ట్, ఆగస్తానా లూథరన్, ఆంధ్ర బాప్టిస్ట్ ట్రూ గాస్పెల్, షాలేం బాప్టిస్ట్, బెరకా బాప్టిస్ట్ చర్చిల్లో వస్త్రదానాలు, ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ నాయకులు బిఎస్.వందనం, టి.సూర్యారావు, జి.అన్నపూర్ణ డేనియల్, పిట్టా సత్యనారాయణ, టి.అమర్‌కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** స్థానిక ఆర్‌సిఎం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల కన్నబాబు, యాళ్ళ విశేశ్వరరావు, యాళ్ళ జగదీశ్, శెట్టిబత్తుల వీరబాబు, శెట్టిబత్తుల నాని పాల్గొన్నారు. **కరప** క్రిస్మస్ సందర్భంగా మండలంలోని పలు చర్చిల్లో ఎంఎల్ఎ పంతం నానాజీ ఆధ్వర్యంలో కేకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, సొసైటీ ఛైర్మన్ సైనవరపు భవానిశంకర్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ వనమాడి



ప్రత్తిపాడులో క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ



తాళ్లరేవులో మాట్లాడుతున్న జడ్‌పిటిసి సామ్యూల్ సాగర్



జగ్గంపేటలో కీస్తు పుట్టిక నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు

## కార్టూ'నిజం'




## చేనేత బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

చేనేత సహకార సంఘాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గారమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సూర్యారాయ విధ్యానంద గ్రంథాలయంలో చేనేత సహకార సంఘాల జెఎసి నాయకులతో కలిసి ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఆప్కో ద్వార గత కొన్ని సంవత్సరాలుగా చేనేత సహకార సంఘాలకు సుమారు రూ.170 కోట్లు బకాయిలు రావాల్సివుందన్నారు. బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలంలో నిలిచిపోయిన త్రిఫ్ట్ ఫండ్, యార్న్ సబ్సిడీ, 30 శాతం రిబేట్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. చేనేత సహకార సంఘాల నుంచి వస్త్రాల కొనుగోలును నిరంతరం కొనసాగించాలని, పావల వడ్డీ రుణ పథకాన్ని పున్నప్రారంభించడమే కాకుండా ఎన్నికల హామీగా ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.25 వేల నేతన్న భరోసా పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. సంక్రాంతి లోపు అన్నీ బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా 18 చేనేత కుల సంఘాలతో కలిసి కాకినాడ జిల్లా కేంద్రంగా రిలే నిరహార దీక్షలు ప్రారంభించి, నిరవధిక నిరహార దీక్షల దిశగా కదిలే కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కూటమి అధికారంలోకి అధికారంలోకి వస్తే చేనేత సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్లు కావస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. చేనేత సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఎంఎల్‌సి కొణిదెల నాగబాబు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో చేనేత సంఘ నాయకులు కోమాకుల సత్యనారాయణ, పడాల అప్పారావు, ఇసుకపల్లి సత్యనారాయణ, రమేష్, సత్తిరాజు, శ్రీనివాస్, శ్రీనివాస్, నాని, రవి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారమేష్



నిమ్మకాయల రంగనాగ్‌ను అభినందిస్తున్న టిడిపి నాయకులు

## రంగనాగ్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన నిమ్మకాయల రంగనాగ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. గురువారం అచ్చంపేటలోని ఆయన స్వగృహంలో నిమ్మకాయల రంగనాగ్‌ను నియోజవర్గానికి చెందిన టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కలిసి పూలమాలలతో సత్కరించారు. జిల్లా కమిటీకి ఎంపికైన మాజీ జడ్‌పిటిసి గుమ్మల్ల విజయలక్ష్మి, వెన్న పద్మనాభం, తాతపూడి కృష్ణబాబు, గుడాల శంకర్, బొందల రామలక్ష్మిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే బాబు, బలుసు వాసు, ముసిరెడ్డి శ్రీరాములు, సలాది బ్రహ్మానందరావు, వీరం రెడ్డి పెదబాబు, బచ్చల జెమిని, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నటి మీనాక్షి చౌదరి సందడి

### ఘనంగా ప్రారంభమైన లక్కీ సిగ్నేచర్ మాల్

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో 'సంక్రాంతి వస్తున్నాం' సినిమా హీరోయిన్ మీనాక్షి చౌదరి సందడి చేశారు. గురువారం మెయిన్ రోడ్‌లో లక్కీ సిగ్నేచర్ ఫ్యామిలీ షో రూంను ఆమె ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన ఈ షోరూంలో అందరి శుభాశీస్సులు అందించాలని మీనాక్షి కోరారు. మహిళల కోసం చీరలు, గాగ్రాలు, లెహంగాలు, ఎన్నో రకాలను అందుబాటు ధరలో అందిస్తోందన్నారు. నటి మీనాక్షిని చూసేందుకు జనం ఎగబడ్డారు. దీంతో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. లక్కీ షో రూంను ఆమె తిరిగి రకరకాల చీరలను తిలకించగా వాటి వివరాలను సిబ్బంది మీనాక్షికి తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న సినీ నటి మీనాక్షిచౌదరి

### టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలిగా వరలక్ష్మి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సతీమణి వరలక్ష్మి టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఎంపికయ్యారు. పార్టీకి సేవలు అందించడంతో టిడిపి అధిష్టానం ఆమెను నియమించింది. ఈ సందర్భంగా ఆమెను టిడిపి నాయకులు అభినందించారు. తన నియమాకానికి సహకరించిన ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభకు, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు

## నేరాలు ఘోరాలు

### విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని జె.అన్నవరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో నివసిస్తున్న మిరియాల గణమ్మ, నూకరత్నం కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. తెల్లవారుజామున సంభవించడంతో ఎటువంటి సామాన్లు తీసుకోకుండా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రెండు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. స్థానిక టిడిపి యువకులు తక్షణ సహాయంగా 25 కిలోల బియ్యం, కూరగాయలు బాధిత కుటుంబాలకు అందజేశారు.


### విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్ యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి వద్ద గురువారం తెల్లవారుజామున ఒక యువకుడు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం..రాజపూడి గ్రామానికి చెందిన కర్నాటి సతీష్ (23) కూలీ పని చేస్తూ తల్లి తండ్రులను పోషిస్తున్నాడు. ప్రతి రోజు పనికి దూరప్రాంతాలకు వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి వస్తుంటాడు. అదే క్రమంలో గురువారం తెల్లవారుజామున స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మంచుకు రోడ్డు కనిపించక విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. అతని తలకు గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో గండేపల్లి మండలం జెడ్ రాగంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### గుండెపోటుతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం



గుండెపోటుతో కౌలు రైతు మృతి చెందిన సంఘటన గోపవరంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కౌలు రైతు ములపర్తి నరసింహమూర్తి (55) కిత్తన చెరువులో రైతు దగ్గర ఎనిమిది ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ప్రతి ఏటా ముంపునకు గురై వరి పంటకు నష్టం వాటిల్లుతోంది. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో నష్టపోయి వ్యవసాయం గిట్టుబాటు కాక, అప్పులపాలై సాగుకు పెట్టుబడి లేక నెల రోజులుగా ఆందోళనతో అతను ఉన్నాడు. నరసింహమూర్తి ఇంటికొచ్చి గురువారం కుప్పకూలి గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని కుటుంబాన్ని సర్పంచ్ కుంచే బుల్లియ్య, రాష్ట్ర అగ్రి మిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ అయితాబత్తుల వెంకట కృష్ణారావు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటరమణ తదితరులు పరామర్శించారు. మృతుడు నరసింహమూర్తికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### భవనం మెట్ల నుంచి జారిపడి యువతి మృతి

ప్రజాశక్తి - రాజోలు



భవ్యశ్రీ (ఫైల్)

భవనం మెట్ల నుంచి జారిపడి యువతి గురువారం మృతి చెందింది. శివకోటిలో కుంతలేశ్వరి అమ్మవారి జాతర ప్రారంభ వేడుకలల్లో ఈ అపశ్రుతి చోటుచేసుకుంది. గురువారం జరగాల్సిన అమ్మవారి గ్రామ ప్రవేశం సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు కాళికాదేవి, దేవతా మూర్తుల వేషధారణతో నృత్యాలు చేసే నాట్య బృందాలను బుధవారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి తీసుకువచ్చారు. వీరు బస చేసేందుకు అమ్మవారి ఆలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల కళ్యాణ మండప భవనం ఇచ్చారు. గురువారం తెల్లవారు జామున పాలపర్తి భవ్యశ్రీ (17) మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు రెండవ అంతస్తు మెట్ల నుంచి జారి పడింది. వెంటనే ఆలయ కమిటీ సభ్యులు, తోటి కళాకారులు ఆమెను రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. తలకు గాయం కావడంతో ఆమె మృతి చెందిందని వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రి వద్ద మృతురాలి తల్లి చినపాప రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. సోదరి పాలపర్తి మధు పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### మానవ హక్కుల నాయకులపై దాడి అమానుషం

**రాజోలు:** మానవ హక్కుల నాయకులపై దాడి అమానుషమని మానవహక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూషి జాన్ మోషే అన్నారు. గురువారం వారు రాజోలులో విలేకరులతో మాట్లాడుతూ శివకోటి జాతర ఉత్సవాలు ప్రారంభానికి వచ్చిన కళాకారుల బృందంలో ఒక యువతి మృతి చెందిందనే విషయంపై రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మానవ హక్కుల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు జనిపల్లి సత్యానందం అలియాస్ నాని, బహుజన సమాజ్ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్చార్జి ఆకుమర్తి భూషణం విషయ సేకరణ చేస్తున్నారన్నారు. అయితే ఈ సమయంలో వారిపై అక్కడే ఉన్న స్థానిక నాయకుడు పినిశెట్టి వెంకటస్వామి అలి యాస్ బుజ్జి, అతని అనుచరులు నాని నుంచి సెల్ ఫోన్ లాక్కుని దుర్భాషలాడి కొడుతూ బయటకు లాక్కుని వచ్చారని అన్నారు. దాడికి పాల్పడి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుతోపాటు, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితులతో కలసి రాజోలు సిఐ టివి.నరేష్‌కుమార్ కు ఫిర్యాదు చేశారు.

# శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌లో బిగ్‌బాస్ విజేత సందడి

ప్రజాశక్తి - కాకినాడ



బిక్‌బాస్ విజేత ట్రోఫీని ప్రదర్శిస్తున్న కల్యాణ్ పడాల

బిగ్‌బాస్ సీజన్ 9 విజేత, భారత సైనికుడు కల్యాణ్ పడాల తాను చదువుకున్న శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌ను గురువారం సందర్శించారు. దీంతో ఇన్‌స్టిట్యూట్‌లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా తన పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ తన ఎదుగుదలలో శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ పాత్రను ఆయన కొనియాడారు. తొలుత ఆయనకు ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్యామ్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై బిగ్‌బాస్ విజేత ట్రోఫీని కల్యాణ్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నేర్చుకున్న క్రమశిక్షణ, పట్టుదలే తనను ఈ స్థాయికి తీసుకొచ్చిందన్నారు. బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్నప్పుడు కూడా తన గత పోరాటం, ఇక్కడ నేర్చుకున్న పాఠాలు తనకు ధైర్యాన్ని ఇచ్చాయని అన్నార. ఈ గెలుపు తనది మాత్రమే కాదని, తనను ఆదరించిన అభిమానులు, గురువులదేనని అన్నారు. అనంతరం డైరెక్టర్ శ్యామ్ మాట్లాడుతూ తమ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిగా కల్యాణ్ ఎంతో అంకితభావంతో ఉండేవారన్నారు. నేడు జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుని విన్నర్‌గా తిరిగి రావడం తమ అందరికీ గర్వకారణం అన్నారు. యువతకు ఆయనొక స్ఫూర్తి అని ప్రశంసించాడు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసి ఉద్యోగులు సంఘటితం కావాలి

ప్రజాశక్తి - కాకినాడ



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న బిసి ఉద్యోగులందరూ సంఘటితం కావాలని బిసి, ఒబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జయ రెసిడెన్సీలో సంఘం అధ్యక్షులు వాసంశెట్టి కామేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల జనవరి 4వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సంఘం 2026 సంవత్సరపు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని, కావున ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న బిసి ఉద్యోగులు విజయవాడకు తరలిరావాలని కోరారు. అనంతరం రాష్ట్ర మహాసభ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఎపీడీ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్దంకి వెంకన్నబాబు, రామరాఘవ, ముల్లు సత్యనారాయణ, గౌరవ సలహాదారులు దొమ్మేటి సుధాకర్, ప్రొఫెసర్ ఇళ్ళ దోసగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - సామర్లకోట



స్విచ్ ఆన్ చేసి లైటింగ్‌ను ప్రారంభిస్తున్న చినరాజప్ప

పట్టణంలోని మెహెరా కాంప్లెక్స్ సెంటర్, బ్రౌన్‌పేట సెంటర్లలో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప బుధవారం రాత్రి ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల డివైడర్ల మధ్య ఈ ఆధునిక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులకు మరింత భద్రత లభించడంతో పాటు పట్టణ సుందరీకరణకు ఈ సెంటర్ లైటింగ్ ఉపయోగపడుతుం దన్నారు. పట్టణాన్ని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, సిఐ ఎ.కృష్ణభగవాన్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, అందుగుల జార్జి చక్రవర్తి, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు.


### 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో ఈ నెల 27న విదుయత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరంగి హెడ్ క్వార్టర్ ఫీడర్‌పై ఉన్న తాళ్లరేవు, జిఎస్‌పిసి ఫీడర్‌పై ఉన్న భైరవపాలెం, పల్లిపాలెం ఫీడర్‌పై ఉన్న పి.మల్లవరం, పత్తిగొంది, గ్రాంట్, నీలపల్లి, జార్జిపేట, ఎంఎల్‌కె.నగర్ గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఎంపీని కలిసిన వీరమహిళ జ్యోతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



ఎంపి తంగెళ్లతో జ్యోతి

ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన వీర మహిళ దలే జ్యోతి కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటా నని ఎంపి తెలిపారు. జనసేన పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని జ్యోతి కోరారు.

### ఏలేశ్వరం నుంచి ఇద్దరికి చోటు

ప్రజాశక్తి - ఏలేశ్వరం



పి.సూరిబాబు



మామిడి లలిత

టిడిపి జిల్లా కార్యవర్గంలో ఏలేశ్వరం మండలం నుంచి ఇద్దరికి చోటు దక్కింది. మండలంలోని తిరుమాలికి చెందిన టిడిపి సీనియర్ నేత పసల సూరిబాబు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా, ఏలేశ్వరంకు చెందిన మహిళ నేత మామిడి లలిత సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదవులు లభించేందుకు కృషి చేసిన ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వీరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



కొత్తపేట చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు

### గొల్లప్రోలులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలోని లిటిల్ ఫ్లాక్ పెంతికోస్తు చర్చి, క్రీస్తు మహిమ చర్చిలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గురువారం రాత్రి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్ధనలను నిర్వహించారు. పాస్టర్ రాజబాబు, ఇశ్రాయేలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలను జరిగాయి.. మైకులు లేకుండానే ఇక్కడ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. అలాగే పట్టణంలోని ఒలీవల దైవ సన్నిధి, ఆర్‌సిఎం చర్చిల్లోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల కళారూపాలు ఆకట్టుకున్నాయి.



ఎన్నికైన నూతన కమిటీ పాలకవర్గం సభ్యులు

### యాదవ సేవ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన యాదవ సేవ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఈగల కొండబాబు, అధ్యక్షుడిగా గింజాల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మఠం లోవరాజు, ప్రధాన కార్యదర్శిగా కుండల నాగసురేష్‌కుమార్, కోశాధికారిగా కొల్లుబోయిన దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శులుగా కొల్లు అప్పలరాజు, గింజాల నాని, మొల్లి శివశంకర్‌ప్రసాద్, గౌరవ సలహాదారుడిగా ఈగల త్రిమూర్తులు, యువ జన విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా మఠం సతీష్, కొయ్యన ఫణీంద్రలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘ లక్ష్యాలు, రాబోయే కార్యాచరణపై చర్చించారు.



అవగాహన కార్యక్రమాలో మాట్లాడుతున్న సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్

### డ్రగ్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాలలో పోలీసులు డ్రగ్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ టి.రఘునాథరావు అధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ పాల్గొని డ్రగ్స్ వల్ల వచ్చే అనర్థాలపై వివరించారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలు, మత్తు పానీయాలు జోలికి వెళ్లకూడదన్నారు. సైబర్ మోసాగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శక్తి యాప్ ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదు ఉంచుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రఘునాదరావు, ఎఎస్‌ఐలు భైరవస్వామి, శేఖర్, సిబ్బంది నరాల సత్యనారాయణ, సోమరాజు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు బాదం మాధవరావు

ప్రజాశక్తి - పిఠాపురం



మాధవరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సామాజిక వేత్త, వితరణశీలి బాదం మాధవరావు ఆదర్శప్రాయుడని పలువురు కొనియాడారు. గురువారం స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో కార్యదర్శి కొండేపూడి శంకరరావు అధ్యక్షతన మాధవరావు 87వ జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణ అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తి మాధవరావు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహరెడ్డి పాల్గొని మాధవరావు వంటి నిస్వార్థపరులు సమాజాభివృద్ధికి ఎంతైనా అవసరమన్నారు. వారి పేరు మీద సాహితీ పురస్కారం పొందడం తనకు మరింత గౌరవాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తహశీల్దార్, ఆస్వాదన సాహితీ సంస్థ కార్యదర్శి కొరుప్రోలు గౌరినాయుడు మాట్లాడుతూ లలిత కళలపై మాధవరావుకున్న శ్రద్ధా భక్తులను కొనియాడారు. అనంతరం ప్రముఖ సాహితీ వేత్త, చరిత్ర పరిశోధకులు ర్యాలి ప్రసాద్ నిర్వహించిన జాతీయ స్థాయి పద్యకవితా పురస్కారాన్ని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర సంగీత సమాఖ్య అధ్యక్షులు గట్టి కృష్ణదేవరాయలు, సాహితీవేత్త సోమయాజులు, వెన్నపు చక్రధరరావు, బాదం సూర్యప్రకాష్, అల్లవరపు నగేష్, కేతవరపు సత్యయేసుకృష్ణ, పెమ్మరాజు రామచంద్రరావు, కోమనపల్లి అప్పారావు, కెవిఎస్ ప్రసాద్, చింతపల్లి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.



ఫిజికల్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

### పోటీ పరీక్షల్లో శ్యామ్ అగ్రగామిగా నిలవాలి

ప్రజాశక్తి - కాకినాడ

పోటీ పరీక్షల్లో కాకినాడకు చెందిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ అగ్రగామిగా నిలవాలని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ ఏడాది వివిధ పరీక్షల్లో గణనీయమైన ఫలితాలు సాధించిందని, అదే తరహాలో శ్యామ్ ఖ్యాతి జాతీయ స్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. గురువారం శ్యామ్ ఇన్స్టిట్యూట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిజికల్ గ్రౌండ్‌ను ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, ఎంఎల్ఎ పంతం వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల ట్రైనింగ్ విభాగాలను పరిశీలించారు. శ్యామ్ సంస్థలో విద్యార్థులను ప్రతిభావంతులుగాను, ఉన్నత ఉద్యోగ అవకాశాల్లో తీర్చిదిద్దుతున్న డైరెక్టర్ శ్యామ్ అతని బృందాన్ని ఎఎస్‌పి ఎ.శ్రీనివాసరావు అభినందించారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కరప

టిడిపి కాకినాడ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కరపకు చెందిన దేవు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. గతంలో ఆయన మండల పార్టీ అధ్యక్షునిగా పని చేశారు.